


నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
గురువారం
9-07-2026
సంపుటి : 01 సంచిక : 108 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక




Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు

## దద్దరిల్లిన కువైట్, బహ్రెయిన్..



- సైరన్ల మోతలతో ఉలిక్కిపడుతున్న పశ్చిమాసియా
- ఇరాన్‌లోని 80 లక్ష్యాలపై అమెరికా దాడులు..
- 85 అమెరికా స్థావరాలపై విరుచుకుపడిన టెహ్రాన్
- ఎంఓయూ కథ ముగిసింది : ట్రంప్
- ధీటుగా తిప్పికొడతాం : టెహ్రాన్

జనరల్ డెస్క్ జూలై 8 (మహాప్రభ)
మధ్యప్రాచ్యం మరోసారి దాడులతో దద్దరిల్లింది. అమెరికా సేనలు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ఏకంగా 80 ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేశాయి. అమెరికా దాడులపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. దాడులకు తగిన విధంగా జవాబిస్తానని హెచ్చరించింది. కువైట్, బహ్రెయిన్ లోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే బహ్రెయిన్, కువైట్‌లలో గగనతల రక్షణ

-మిగతా 3 లో




# ఎగిసిన ముడి చమురు ధరలు

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తత.. చమురు ధరలకు రెక్కలు
- బ్రెంట్, డబ్ల్యూటీఐ ధరలు 5 శాతంపైగా జంప్
- ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన
- ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై ప్రభావం
- భారత్‌లోనూ పెరగనున్న ధరల భారం

వాషింగ్టన్ :
అమెరికా--ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బుధవారం ఐదు శాతానికిపైగా ఎగిశాయి. ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో పాటుగా ఇకపై ఇరాన్ నాయకత్వంతో చర్చలు కొనసాగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామాల ప్రభావంతో అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యుటిఐ) ముడి చమురు ధర బ్యారెల్‌పై ధర 5.8 శాతం ఎగిసి 74.50 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర కూడా బ్యారెల్‌పై 5.65 శాతం ఎగిసి 78.35 డాలర్లుగా నమోదయ్యింది. జూన్‌లో రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం తర్వాత హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తగ్గి వాణిజ్య నౌకల

-మిగతా 3 లో



# ఒకటో తరగతిలో 70% ప్రైవేట్‌కే..

- సర్కార్ బడుల్లో చదువుతున్నది 28శాతమే
- తాజాగా యూడైస్ ప్లస్ 2025-26 నివేదిక వెల్లడి
- రానురాను పూర్తిగా ఖాళీ అవుతున్న ప్రభుత్వ బడులు
- రాష్ట్రంలో 4,793 సింగిల్ టీచర్ పాఠశాలలు
- విద్యుత్తు కనెక్షన్లు లేని సర్కార్ బడులు 180


హైదరాబాద్, జూలై 8 (మహాప్రభ)
: రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో చదివే విద్యార్థుల్లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులు కేవలం 28 శాతం మాత్రమే ఉన్నారు. అంటే 70.43 శాతం మంది ప్రైవేట్ బడులకు వెళ్తున్నారు. రానురాను ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ మరింత తగ్గే ప్రమాదం పొంచి ఉన్నది. Geographic Reference ఈ విషయాన్ని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్ ఎడ్యుకేషన్ ప్లస్ 2025–26 నివేదిక తాజాగా వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం 2025–26 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 6,39,730 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. వీరిలో కేవలం1,83,974 (28 శాతం) మంది మాత్రమే సర్కార్ బడుల్లో ఒకటో తరగతిలో చేరారు. ఎయిడెడ్ బడుల్లో 4,997(0.78శాతం) మంది మాత్రమే ఉన్నారు. అదే ప్రైవేట్ స్కూళ్లల్లో ఏకంగా 4,50,578 (70.43శాతం)

-మిగతా 3 లో

# సింగరేణిపై కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం

## తాడిచర్ల బొగ్గు బ్లాకును కేంద్రం ఇవ్వలేదు

- యూపీఏ హయాంలోనే కేటాయించారు
- గోదావరి లోయలోని బొగ్గు బ్లాకులు కేటాయించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**2013లోనే సింగరేణికి కేటాయించిన తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను ఇప్పుడు కేంద్రం కొత్తగా ఇచ్చినట్లు ప్రచారం చేయడం పూర్తిగా అసత్యమని, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ బొగ్గు బ్లాక్‌కు కేంద్రం తాజాగా చేసినది కేవలం లీజ్ మంజూరు మాత్రమేనని, కేటాయింపు ఇప్పటికే యూపీఏ ప్రభుత్వ హయాంలో పూర్తైందని స్పష్టం చేసిన ఆయన.. పదేళ్లపాటు లీజ్‌ను పెండింగ్‌లో పెట్టిన కేంద్రం ఇప్పుడు అదే ప్రక్రియను తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం రాజకీయ మోసమేనని మండిపడ్డారు. అంతేకాక, గిరిజన ప్రాంతాల్లోని బొగ్గు బ్లాక్‌లను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే అప్పగించాలని, ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు రాజ్యాంగ, చట్ట విరుద్ధమని హెచ్చరిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని భట్టి విక్రమార్క ఆరోపించారు.**

హైదరాబాద్ జూలై 8 (మహాప్రభ)
సింగరేణి కాలరీస్ సంస్థకు తాడిచెర్ల–2 కోల్ బ్లాక్ కేటాయింపుపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2013లో కేటాయించిన బొగ్గు బ్లాకును మళ్లీ సింగరేణికి కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికే కేటాయించిన బొగ్గు బ్లాక్ కు కేంద్రం మంజూరు చేసింది కేవలం లీజు మాత్రమేనని స్పష్టం చేశారు. 2013 నుంచి లీజు ఇవ్వకుండా కేంద్రం జాప్యం చేసిందని విమర్శించారు. 2010 నుంచి 2012 వరకు కేంద్ర బొగ్గు శాఖకు చేసిన విజ్ఞప్తులపై స్పందిస్తూ నాటి యూపీఏ ప్రభుత్వం 2013 సెప్టెంబర్ 16న తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ ను

-మిగతా 3 లో




# త్వరలో ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

- ప్రయివేటురంగంలో ఖమ్మంలో ఏర్పాటు
- సీఎంతో భేటీ అయిన గోద్రేజ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు

హైదరాబాద్ జూలై 8 (మహాప్రభ)
తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ఆయిల్‌పామ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్(కార్పొరేట్ వ్యవహారాలు) రాకేష్ స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి తెలిపారు. బుధవారం వారు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎమ్‌సీహెచ్చార్డీ)లోని బోధి పెవిలియన్‌లో సీఎం ఏ రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోద్రేజ్ ప్రతినిధులు తమ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ఖమ్మం జిల్లాలో ప్రయివేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. దీనిపై పలు కీలక అంశాలపైన చర్చలు జరిపారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటువుతున్న ఈ ప్రాజెక్ట్

-మిగతా 3 లో



### పదకొండేళ్ల బాలికపై హత్యాచారం కేసు..

నిందితుల్లో ఒకడు పోలీస్ ఎన్‌కౌంటర్లో హతం..!


2



### పండ్ల తోటలో నక్కిన ఉగ్రవాదుల్లో ఒకడు హతం..

లష్కరే టాప్ కమాండర్ జాకీర్ అహ్మద్‌గా గుర్తింపు


2




### నీట్ యూజీ 2027లో భారీ మార్పులు..

- కంప్యూటర్ బేస్డ్.. తక్కువ సెంటర్లు..
-నివేదికలోని విషయాలివే

2



2

### అమెరికాలో లారెన్స్ బిష్ణోయ్‌పై కేసు

# నేడు అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు

- భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర ప్రారంభం
- నజఫ్, కర్బలాలో లక్షలాది మంది నివాళులు
- అంతిమయాత్రలో మార్మోగిన మద్దతు నినాదాలు
- కట్టుదిట్టమైన భద్రత నడుమ అంత్యక్రియల ఏర్పాట్లు



3

# కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

## ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లను కాపాడుకోవాలి

- నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చాం..
- కార్మికులకు భరోసా కల్పిస్తూ నిర్ణయాలు :
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు శంకుస్థాపన



మహబూబ్‌నగర్ జూలై 8 (మహాప్రభ)
కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలమైన రాజకీయ వాతావరణాన్ని కల్పించుకోవడానికే 'సర్'ను ఒక వేదికగా ఉపయోగించుకుం టుందనీ, ప్రజాస్వామ్య బద్ధంగా ఓట్లను కాపాడుకోవాల్సిన అవసరముందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సు డిపో దగ్గర నూతన బస్టాండుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఆర్టీసీని విధ్వంసం చేసేలా చర్యలు తీసుకుందని, 53 రోజులపాటు కార్మికులు సమ్మె చేసినా ఏమాత్రం పట్టించుకోకుండా పదుల సంఖ్యలో


-మిగతా 3 లో

# ఎఫ్‌బీఐ వాంటెడ్ జాబితాలో పంజాబ్ పోలీసు ఆఫీసర్



**న్యూయార్క్ ,న్యూఢిల్లీ, జూలై 8 (మహాప్రభ)**
అమెరికా ఎఫ్‌బీఐ వాంటెడ్ జాబితాలో ఓ పంజాబీ పోలీసు ఆఫీసర్ ఉన్నారు. ఆపరేషన్ హార్డ్ బాల్ పేరుతో అమెరికా ఓ ఆపరేషన్ నిర్వహించింది. ఇండియా నుంచి నేరాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకునే క్రమంలో ఆ ఆపరేషన్ చేపట్టారు. అయితే మొత్తం 37 మంది భారతీయ నేరస్థులను వాంటెడ్ లిస్టులో అమెరికా చేర్చింది. గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, భగవాన్‌పురియా కూడా ఆ జాబితాలో ఉన్నారు. ఓ మర్డర్ కేసులో పోలీసు ఆఫీసర్ గురిందర్జీత్ సింగ్ అమెరికాలోని ఓ బాధిత కుటుంబం నుంచి సుమారు నాలుగు లక్షల డాలర్లు వసూల్ చేసినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో యూఎస్ అటార్నీ ఫస్ట్ అసిస్టెంట్ బిల్ ఎస్సేలీ ఈ విషయాన్ని తెలిపారు.జగ్గూ భగవాన్‌పురి క్రిమినల్ సిండికేట్ కేసులో ఓ పంజాబ్ పోలీసు అధికారి బెదిరింపు వసూళ్లకు పాల్పడిన్లటు ఆరోపించారు. ఎఫ్‌బీఐ సుమారు 37 మంది భారతీయ నేరస్థులపై అభియోగాలు నమోదు చేసింది. అమెరికాలో ఉన్న బాధిత కుటుంబం నుంచి ఆ ఆఫీసర్ నాలుగు లక్షల డాలర్లు వసూల చేసినట్లు తెలిపారు. ఆ డబ్బులు ఇవ్వకుంటే ఇండియాలో ఉన్న కుటుంబంపై మర్డర్ కేసు పెట్టనున్నట్లు ఆ పోలీసు బెదిరించారన్నారు. అయితే ఈ కేసులో ఆ పోలీసు అధికారిని అమెరికాకు అప్పగించాలని కోరనున్నట్లు చెప్పారు.

## అమెరికాలో లారెన్స్ బిష్ణోయ్‌పై కేసు



**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
భారత్-కెనడా దౌత్యసంబంధాల్లో ఒడుదొడుకులకు దారితీసిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసులో కీలకపరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అతడి సహచరుడు గోల్డీబ్రార్‌పై అమెరికాలో కేసు నమోదైంది. నిజ్జర్‌ను హత్యచేయాలని వారి నుంచి ఆదేశాలు అందాయని అమెరికా దర్యాప్తు అధికారులు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. యూఎస్‌కు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అంతర్జాతీయస్థాయిలో ‘ఆపరేషన్ హార్డ్‌బాల్’ను చేపట్టింది. దానిలో భాగంగా అమెరికా, కెనడా, ఐరోపావ్యాప్తంగా బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన 24 మంది మంది అనుమానితులు అరెస్టు అయ్యారు. ఈ నేపథ్యంలోనే బిష్ణోయ్, గోల్డీబ్రార్ అభియోగాలు నమోదయ్యాయి. గోల్డీపై 50,000 డాలర్ల రివార్డును కూడా ప్రకటించింది.

## రన్‌వేపై ఎదురెదురుగా వచ్చిన విమానాలు..

### తృటిలో తప్పిన పెను ప్రమాదం..



**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
ముంబై విమానాశ్రయం లో ఘోర ప్రమాదం తప్పింది. ఒకే రన్‌ఎ పైకి ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు ఎదురెదురుగా వచ్చాయి. ఎయిరిండియా పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఓ రన్‌వేపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ల్యాండ్ అయ్యింది. ఆ సమయంలో అదే రన్‌వే నుంచి టేకాఫ్ అవ్వడానికి ఎయిర్ ఇండియా విమానం ఎదురుగా వచ్చింది.ఇది గమనించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ ఎయిర్ ఇండియా విమాన పైలట్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే విమానాన్ని ఆపివేశారు. రెండు విమానాలు కేవలం కొన్ని అడుగుల దూరంలో ఎదురెదురుగా ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. రెండు విమానాలలోని ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించినట్లు అధికారులు వెల్లడించారు. ఎయిర్ ఇండియా విమానం ముంబై నుంచి ఢిల్లీకి వెళ్తున్నట్లు.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సిలిగుడి నుంచి ముంబైకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు నిర్వహించడానికి ఎయిరిండియా విమానాన్ని బేస్‌కు తరలించామని.. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తెలిపింది.

## బద్రీనాథ్ ఆలయ ఉద్యోగి సస్పెండ్

**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయంలో విరాళాల అక్రమాలపై కీలక పరిణామం చోటు చేసుకుంది. నలుగురు సభ్యులతో కూడిన టీమ్ విచారణ ప్రారంభించిన రెండోరోజే ఆలయ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. విరాళాల అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలు లభించడంతో కమిటీలో ప్రైవేట్ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రమోద్ నౌటియాల్‌ను సస్పెండ్ చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ హేమంత్ ద్వివేదీ తెలిపారు.ద్వివేదీ మాట్లాడుతూ.. ఎవరైనా తప్పు చేసినట్టు విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కమిటీ 15 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వనుంది. ఆలయ విరాళాల్లో అక్రమాలు జరిగాయని సోషల్ మీడియాలో ఆరోపణలు రావడంతో విచారణ కోసం ఆలయ కమిటీ నలుగురు సభ్యుల కమిషన్ వేసింది.

# పదకొండేళ్ల బాలికపై హత్యాచారం కేసు..

**నిందితుల్లో ఒకడు పోలీస్ ఎన్‌కౌంటర్లో హతం..!**



**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
పశ్చిమబెంగాల్ లోని బరుయ్‌పుర్ లో 11 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడు బుధవారం తెల్లవారుజామున పోలీసుల ఎన్‌కౌంటర్ లో మృతిచెందాడు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అతడిని తీసుకెళ్లగా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఓ పోలీసు వద్ద ఉన్న తుపాకీ లాక్కొని పారిపోవడానికి యత్నించడమే కాకుండా.. ఒక రౌండ్ కాల్పులు కూడా జరిపాడని పేర్కొన్నారు.దాంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా అతడికి బుల్లెట్ గాయాలయ్యాయని వెల్లడించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కేసులో అతడు ప్రధాన నిందితుల్లో ఒకడని, బాలిక అదృశ్యమయ్యే ముందు ఆమెతో కలిసి ఉన్నట్లు సీసీటీవీ దృశ్యాల్లో గుర్తించినట్లు చెప్పారు. హత్యాచార ఘటనపై స్థానికుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. బాలిక మృతదేహం లభించిన కొద్ది గంటల్లోనే అనుమానంతో ఓ వ్యక్తిని స్థానికులు కొట్టిచంపారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు ఆరుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేశారు. మరోవైపు ఈ ఘటనపై 72 గంటల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి డీజీపీని ఆదేశించారు.

# ఐదుగురు సిబ్బందితో వెళ్తున్న పాకిస్థాన్ కార్గో విమానం మిస్సింగ్..!



**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
షార్జా నుంచి కరాచీ కి బయలుదేరిన ఒక పాకిస్థాన్ కార్గో విమానం ఐదుగురు సిబ్బందితో సహా అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. అరేబియా సముద్రం మీదుగా ప్రయాణిస్తుండగా ఈ బోయింగ్ 737 విమానం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు కోల్పోయింది. నావిగేషన్ వ్యవస్థ లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్ సమాచారం ఇచ్చిన కొద్ది నిమిషాలకే ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో పాకిస్థాన్ అధికారులు వెంటనే వివిధ ఏజెన్సీలతో కలిసి సముద్రంలో భారీ గాలింపు చర్యలు చేపట్టారు.పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం.. కే2 ఎయిర్‌వేస్ అనే ప్రైవేట్ సంస్థకు చెందిన ఈ విమానం పాక్ కాలమానం ప్రకారం రాత్రి 9:18 గంటలకు నావిగేషన్ సమస్య గురించి కరాచీ ఏటీసీకి తెలిపింది. ఏటీసీ అధికారులు విమానానికి మార్గనిర్దేశం చేసే ప్రయత్నంలో ఉండగానే, కేవలం మూడు నిమిషాల తర్వాత విమానం వేగంగా కిందకు పడిపోతున్నట్లు రాడార్‌లో నమోదైంది. కరాచీకి పశ్చిమంగా 287 కిలోమీటర్ల దూరంలో బలూచిస్థాన్‌లోని ఓర్మారా తీరానికి సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రముఖ విమానయాన ట్రాకింగ్ సంస్థ ‘ఫ్లైట్‌రాడార్ 24’ విశ్లేషణ ప్రకారం.. విమానం గాల్లో పలుమార్లు ఎత్తును కోల్పోయి, మళ్లీ పైకి లేచి, ఆ తర్వాత ఒక్కసారిగా సముద్రం వైపు దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. సంబంధాలు తెగిపోయే ముందు విమానం కేవలం 1,100 అడుగుల ఎత్తులో ఉందని, నిమిషానికి 22,400 అడుగుల అసాధారణ నిలువు వేగంతో కిందకు పడిపోయిందని డేటా సూచిస్తోంది. ఈ వేగం విమానం నియంత్రణ కోల్పోయి కూలిపోయిందనే వాదనకు బలం చేకూరుస్తోంది. అదృశ్యమైన ఈ విమానం 27 ఏళ్ల నాటి బోయింగ్ 737-400. కే2 ఎయిర్‌వేస్ సంస్థ నిర్వహిస్తున్న ఏకైక విమానం కూడా ఇదే. ఈ విమానాన్ని 2024లో సేవల్లోకి తీసుకువచ్చారు. ఇది మొదట 1999లో ప్యాసింజర్ విమానంగా సేవలు అందించి, 2012లో కార్గో విమానంగా మార్పు చెందింది. ప్రస్తుతం విమాన శకలాల కోసం, సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది.

# పండ్ల తోటలో నక్కిన ఉగ్రవాదుల్లో ఒకడు హతం..


**లష్కరే టాప్ కమాండర్ జాకీర్ అహ్మద్‌గా గుర్తింపు**



**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరివేతకు ఆపరేషన్ చేపట్టిన భద్రతాబలగాలు బుధవారం భారీ విజయం సాధించాయి. షోపియాన్ లో ఓ పండ్ల తోటలో నక్కిన ఒకడిని బుధవారం హతమార్చాయి. మృతుడిని లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ జాకిర్ అహ్మద్ ఘనీ గా గుర్తించారు. అతడికి పహల్గామ్ ఉగ్రదాడితో సంబంధాలున్నట్లు దర్యాప్తు వర్గాలు చెబుతున్నట్లు సమాచారం.షోపియాన్‌లోని ఓ పండ్ల తోటలో ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు ఇటీవల నిఘా కెమెరాల్లో రికార్డయ్యాయి. దాంతో జమ్మూకశ్మీర్ పోలీసులు, ఆర్మీ, సీఆర్పీఎఫ్ దళాలు జూలై 3న సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఉగ్రవాదులు నక్కిన ప్రాంతాన్ని నలుమూలల నుంచి దిగ్బంధించి వేట మొదలుపెట్టాయి. దాదాపు ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌లో బుధవారం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలను గమనించిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం ఘటనా స్థలంలో ఓ ఉగ్రవాది మృతదేహాన్ని గుర్తించారు. అతడిని జాకిర్ అహ్మద్ ఘనీగా తేల్చారు. అతడితోపాటు ఉన్న మరో ఉగ్రవాది లతీఫ్ భట్ కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. అతడు బయటకు వెళ్లకుండా తోట చుట్టూ విక్టర్ ఫోర్స్ దళాలు మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ‘మీరు పారిపోవచ్చేమో.. కానీ దాక్కోలేరు’ అని ఉగ్రవాదులను హెచ్చరించారు. కుల్గామ్‌కు చెందిన జాకిర్ ఘనీ కొన్నేళ్లుగా లష్కరే తయ్యిబా ముఠాలో కీలకంగా పనిచేస్తున్నాడు. గతంలో భద్రతా సిబ్బందిపై దాడులు, పౌరుల హత్యల కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి అతడిపై నిఘా వర్గాలు దృష్టిపెట్టాయి. 2025 ఏప్రిల్‌లో పహల్గాంలో చోటుచేసుకున్న భీకర ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు సమయంలోనూ జాకిర్ పేరు వినిపించింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా జాకిర్‌కు సంబంధించిన ఓ ఇంటిని కూడా కూల్చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

# నీట్ యూజీ 2027లో భారీ మార్పులు..


**- కంప్యూటర్ బేస్డ్.. తక్కువ సెంటర్లు..**
**-నివేదికలోని విషయాలివే**




**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
ఈ ఏడాది జరిగిన నీట్ యూజీ పరీక్ష ఎంతటి వివాదం సృష్టించిందో తెలిసిందే. పరీక్షా పత్రం లీక్ కావడం, దీంతో పరీక్ష రద్దు కావడం, మళ్లీ నిర్వహించడం, విద్యార్థుల ఆత్మహత్యలు, ఆందోళనలు, రాజకీయ విమర్శలు.. ఇలా నీట్ పరీక్ష చుట్టూ బోలెడు వివాదాలు నడిచాయి. కానీ, మొత్తానికి నీట్ రీ ఎగ్జామ్ జరిగింది. ఫలితాలు త్వరలోనే విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది జరగబోయే నీట్ యూజీ 2027కు సంబంధించి కీలక మార్పులు జరగబోతున్నాయి. ఈ మేరకు నీట్ పరీక్ష నిర్వహించే ‘ద నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీయే)’ కొన్ని మార్పులు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది.ఈ ఏడాది జరిగినట్లు లీకేజీలు జరగకుండా, విమర్శలకు తావులేకుండా ఈ పరీక్ష నిర్వహించాలని ఎన్‌టీయే లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని నివేదికల సమాచారం ప్రకారం.. వచ్చే ఏడాది పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా జరగనుంది. అంటే పూర్తిగా కంప్యూటర్‌పైనే పరీక్ష నిర్వహిస్తారు. ఇలా నీట్ పరీక్ష నిర్వహించనుండటం ఇదే మొదటిసారి. అలాగే, ఇప్పట్లోలాగే ఒకేరోజు పరీక్ష కాకుండా కనీసం ఐదు లేదా ఆరు రోజులపాటు పరీక్ష జరుగుతుంది. ఇటీవలి పరీక్షకు దాదాపు 23 లక్షల మంది హాజరయ్యారు. అందువల్ల ఐదు రోజులపాటు పరీక్ష నిర్వహిస్తే.. రోజుకు ఐదు లక్షల మంది వరకు హాజరవుతారు. పరీక్షా కేంద్రాలను కూడా తగ్గిస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5,000 కేంద్రాలలో పరీక్ష జరుగుతుంది. అయితే, ఇకపై 500 పట్టణాల్లో, 1,000 కేంద్రాలలో మాత్రమే పరీక్ష నిర్వహించాలని ఎన్‌టీయే భావిస్తోంది. అవి కూడా ఎక్కువ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఎగ్జామ్ నిర్వహించాలనే ఆలోచన చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వ విద్యాసంస్థలైన కేంద్రీయ విద్యాలయాలు, నవదోయ విద్యాలయాలు వంటి వాటిని వినియోగించుకుంటుంది. ప్రైవేటు సంస్థలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు అన్నింటిపై చర్చ జరుగుతోంది. వీటికి ప్రభుత్వ ఆమోదం లభిస్తే.. ఈ విధానంపై తుది నోటిఫికేషన్ వెలువడుతుంది. అంతేకాదు.. ఎన్‌టీయేలో వ్యవస్థాపక మార్పులకు కూడా సంస్థ సిద్ధమైంది. ఎన్‌టీయేలోకి 150 మంది సిబ్బందిని కూడా నియమించుకోబోతుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోపు నియామకపు ప్రక్రియ పూర్తికానుంది.

# మరో ఆలయంలో విరాళాల గోల్‌మాల్..

**-మధ్యప్రదేశ్ బగళాముఖి గుడిలో చేతివాటం**



**భోపాల్ ,జూలై 8 (మహాప్రభ)**
అయోధ్య రాముడి ఆలయం, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ గుడిలో విరాళాల అక్రమాలపై విచారణ జరుగుతున్న టైమ్‌లోనే మరో ఆలయంలో విరాళాల గోల్‌మాల్ తెరమీదికొచ్చింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ లోని అగర్ మాల్వా జిల్లాలో ఉండే మా బగళాముఖి ఆలయంలో విరాళాల అక్రమాలు కలకలం రేపుతున్నాయి. ఈ గుడిలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఉండగానే.. ప్రైవేట్ కమిటీ విరాళాలు వసూలు చేస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ వ్యక్తులు సొంతంగా రసీదులు ఇచ్చి విరాళాలు దండుకుంటున్నారనే నేపథ్యంలో కలెక్టర్ ప్రీతి యాదవ్ జూలై 7న త్రిసభ్య కమిటీ వేశారు.

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు




మొదటి తరువాయి

వ్యవస్థలను క్రియాశీలకం చేశారు. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకంగా ఉన్న ఖర్గ్ దీవిలో పేలుడు శబ్దాలు వినిపించాయి. అలాగే ఓడరేవు పట్టణాలైన బందర్ అబ్బాస్, సిరిక్‌లతో పాటు ఖెష్మ్ దీవిలో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్‌పై జరిగిన దాడిలో అనేక మంది గాయపడ్డారని తెలుస్తోంది. బందర్ అబ్బాస్‌లో మత్స్యకారులకు చెందిన అనేక పడవలు దగ్ధమయ్యాయి. దివంగత సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీకి ఖ్వోమ్ నగరంలో లక్షలాది మంది నివాళులు అర్పించిన మరునాడే అమెరికా ఈ దాడులకు దిగడం గమనార్హం. ఇరాన్‌తో కుదుర్చుకున్న ఎంఓయూ కథ ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టర్కీలో చెప్పారు.

ఇరాన్‌ను దెబ్బతీసేందుకే : సెంట్‌కామ్

'మా దళాలు ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, కమాండ్-కంట్రోల్ వ్యవస్థలు, కోస్తా రాడార్ కేంద్రాలు, నౌకా క్షిపణి విధ్వంసక సామర్థ్యాలపై దాడులు చేశాయి. హోర్ముజ్ సమీపంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)కు చెందిన అరవై చిన్న పడవలపై కూడా దాడి జరిపాయి' అని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఓ ప్రకటనలో వివరించింది. ఒప్పందానికి కట్టుబడి ఉండకపోయినా లేదా దానికి విధేయత చూపకపోయినా ఇరాన్‌ను బాధ్యురాలిని చేసేందుకు తమ దళాలు సిద్ధంగా ఉంటాయని చెప్పింది. ఇరాన్‌ను తీవ్రంగా నష్టపరచడమే ఈ దాడుల ఉద్దేశమని తెలిపింది. ఇరాన్ దళాల అవాంఛనీయ దుందుడుకు చర్యలు కాల్పుల విరమణకు తూట్లు పొడిచాయని, హోర్ముజ్‌లో నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించకుండా అడ్డుకున్నాయని ఆరోపించింది. కాగా పర్షియన్ గల్ఫ్‌లోనూ, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోనూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీరంలో బుధవారం ఉదయం పదికి పైగా అమెరికా యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాయి.

ధీటుగా తిప్పికొడతాం : టెహ్రాన్

'అమెరికా దూకుడుకు, ఉగ్రవాద చర్యలకు మా సాయుధ దళాలు తగిన విధంగా జవాబిస్తాయి. అమెరికా దాడులను సమర్థవంతంగా తిప్పికొడతాయి' అని ఇరాన్‌కు చెందిన ఖతమ్ అల్-అన్బియా కేంద్ర కార్యాలయం తెలిపింది. హోర్ముజ్ జలసంధి నిర్వహణలో కానీ, వ్యవహారాలలో కానీ ఇతరుల జోక్యాన్ని అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇరాన్ నిర్దేశించిన మార్గాలలో ప్రయాణించే నౌకలు మాత్రమే సురక్షితంగా ఉంటాయని చెప్పింది. తమతో కుదుర్చుకున్న ఎంఓయూను అమెరికా ఉల్లంఘిస్తోందని ఇరాన్ శాంతి చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ ఆరోపించారు. 'బెదిరింపులు, దోపిడీల కాలం చెల్లిపోయింది. మేము ఎవరికీ తలవంచం' అని ఆయన చెప్పారు. దేశ ప్రయోజనాలను, భద్రతను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇరాక్ వెళ్లిన దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తాజా పరిణామాల నేపథ్యంలో హుటాహుటిన స్వదేశానికి చేరుకున్నారు.

# ఎగిసిన ముడి చమురు ధరలు

మొదటి తరువాయి




రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ.. తాజా సైనిక చర్యలతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఇరాన్‌కు ఇచ్చిన ఆంక్షల సడలింపును కూడా అమెరికా రద్దు చేయడంతో ప్రపంచ ఇంధన సరఫరాపై అనిశ్చితి నెలకొంది. చమురు ధరల తాజా పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశముందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాలో ఇప్పటికే ఇంధన ధరలు అధిక స్థాయిలో ఉండగా.. ఈ పరిణామాలు ద్రవ్యోల్బణ నియంత్రణతో పాటు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్‌లోనూ ధరలు పెరగడంతో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పెంచే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.


# ఒకటో తరగతిలో 70% ప్రైవేట్‌కే..

మొదటి తరువాయి

మంది చేరారు. కేంద్రం వెల్లడించిన ఈ గణాంకాలు ప్రభుత్వ విద్యపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో అమ్మాయిలు, అమ్మాయిల చదువులపై ఇంకా వివక్ష కనిపిస్తున్నది. అబ్బాయిలను ప్రైవేట్‌కు, అమ్మాయిలను సర్కార్ బడులకు పంపిస్తున్న ఉదంతాలు కనిపిస్తున్నాయి. సర్కార్ బడుల్లో అబ్బాయిలతో పోల్చితే లక్ష మంది అమ్మాయిలు ఎక్కువగా చదువుతుంటే, ప్రైవేట్‌లో అమ్మాయిలతో పోల్చితే అబ్బాయిలు నాలుగు లక్షల మంది ఎక్కువగా చదువుతుండటం గమనార్హం.

# త్వరలో ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

మొదటి తరువాయి



ద్వారా 700 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రం , సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమి ని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గోద్రేజ్ సంస్థ ప్రతినిధులు సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని సీఎంను కోరారు. అలాగే ప్రాసెసింగ్ మిల్ కోసం రాహదారిని విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆదేశించారు.

# సింగరేణిపై కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం

మొదటి తరువాయి

సింగరేణి సంస్థకు కేటాయించిందన్నారు. ఈ బ్లాకులో గిరిజన భూములు ఉన్నందున వాటిని ప్రభుత్వ రంగ సంస్థలే బొగ్గును తీయాలని లేఖలో పేర్కొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధాని, బొగ్గు గనుల శాఖ మంత్రిని కలిసి కేటాయించిన గనికి లీజు అనుమతి ఇవ్వాలని పలు మార్లు విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ ఒత్తిడి మేరకే లీజు మంజూరు చేశారని స్పష్టం చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం పాత్ర లేదన్నారు. గిరిజన ప్రాంతాలు 1/70 చట్టం పరిధిలోకి వస్తాయనీ, ఇక్కడ వారు మాత్రమే భూమిపై సర్వ హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే మైనింగ్ వంటి కార్యకలాపాలు చేసుకునే హక్కు కలిగి ఉంటాయన్నారు. ఈ విష



యాలు చట్టంలో స్పష్టంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇల్లందు సమీపంలోని కోయ గూడెం-3 ఓపెన్ కాస్ట్ బ్లాక్ ను, మణుగూరులోని ఓపెన్ కాస్ట్ డిప్ సైడు గనిని వేలం పాటలో ప్రయివేట్ వ్యక్తులకు కేటాయిం చడం చట్ట వ్యతిరేకమన్నారు. కిషన్‌రెడ్డికి సింగరేణిపై ప్రేమ ఉంటే సంస్థ విస్తరించిన గోదావరి లోయ ప్రదేశంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను కేటాయించాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇప్పటికే కేటాయించిన బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలని భట్టి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేడు అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు

**-భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర ప్రారంభం**
**-నజఫ్, కర్బలాలో లక్షలాది మంది నివాళులు**
**-అంతిమయాత్రలో మార్మోగిన మద్దతు నినాదాలు**
**-కట్టుదిట్టమైన భద్రత నడుమ అంత్యక్రియల ఏర్పాట్లు**

టెహ్రాన్

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు గురువారం జరగనున్నాయి. ఖననం కోసం ఆయన భౌతికకాయాన్ని ఇరాన్‌లోని మషద్‌కు తరలించడానికి ముందు, ఇరాన్లో జరుగుతున్న వీడ్కోలు ప్రదర్శన చివరి దశకు చేరుకున్నది. నజాఫ్‌లోని ఇమామ్ అలీ పవిత్ర పుణ్యక్షేత్రానికి దారితీసే వీధులు లక్షలాది మంది సంతాప వ్యక్తీకర్తలతో కిక్కిరిసిపోయాయి. తమ నాయకుడికి వీడ్కోలు పలుకుతూ అక్కడి ప్రజలు 'ఓ హుస్సేన్, మేం నీ సేవలో ఉన్నాం','ఓ ఖమేనీ, మేం నీ సేవలో ఉన్నాం" అంటూ నినాదాలు చేశారు. మరోపక్క నజాఫ్‌లోని కుఫా వంతెన నుంచి పవిత్ర పుణ్యక్షేత్రాల వైపు కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ యాత్ర ప్రారంభమైందని మీడియా సంస్థలు నివేదించాయి. నైజీరియాలోని ఇస్లామిక్ ఉద్యమ నాయకుడు షేక్ ఇబ్రహీం జక్జాకీతో సహా పలువురు ప్రముఖులు ఈ భారీ జనసందోహంలో పాల్గొన్నారు. ఆయన నజాఫ్‌లో సంతాప వ్యక్తీకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాత్రలో చాలా



మంది యువ నిరసనకారులు ప్రతీకార చర్యకు సంకేతంగా ఎర్ర జెండాలను ప్రదర్శిస్తూ 'మేము ఎప్పటికీ అవమానానికి తలవంచం', 'అల్లాహు అక్బర్' (దేవుడు గొప్పవాడు) అంటూ... అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు.

కర్బలాలో ఊరేగింపులు

అయతుల్లా ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు పవిత్ర నగరమైన కర్బలా వరకు విస్తరించాయి, అక్కడ రెండు పవిత్ర పుణ్యక్షేత్రాల మధ్య ప్రాంతం భారీ సంఖ్యలో ప్రజలతో నిండిపోయింది. ఇరాన్ , టర్కీ నుంచి వచ్చిన యాత్రికులతో పాటు, స్థానిక మార్కెట్లు , దుకాణాలు ఖమేనీ చిత్రపటాలతో అలంకరించబడ్డాయి.

అయతుల్లా ఖమేనీ కుటుంబ సభ్యులు ఇమామ్ హుస్సేన్ , హజ్రత్ అబ్బాస్ ల భౌతికకాయాలు పుణ్యక్షేత్రాలలో చివరి ప్రార్థనల కోసం కర్బలాకు చేరుకున్నాయి. అంత్యక్రియల ఊరేగింపును స్వీకరించడానికి కర్బలా ప్రావిన్స్‌లో దాదాపు 7 మిలియన్ల మంది సంతాపకులు తరలివచ్చినట్టు ప్రాథమిక అంచనా.

# అన్ని స్కాములే

మొదటి తరువాయి

కోట్ల రైతు బంధును ఎగ్గొట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, గొర్రెలు, చేపల పంపిణీ, దళిత బంధు, కేసీఆర్ కిట్టు, ఉచిత కరెంటు, రైతు బీమా, ఇందిరమ్మ రైతు భరోసా వంటి పథకాల అమలు ఏమైందని ప్రశ్నించారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. గురుకులాలు, విద్యుత్, బొగ్గు, సివిల్ సప్లయి ఇలా అనేక సంస్థలలో స్కామ్‌లు జరిగాయన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ స్కాముల ప్రభుత్వాన్ని నడుపుతున్నారన్నారు. యూరియా యాప్‌తో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సింగూరు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి సింగూరు ప్రాజెక్టు మరమ్మత్తుల పేరుతో నీళ్లు ఖాళీ చేసిన ప్రభుత్వం రైతులకు క్రాఫ్ హాలిడే క్రింద ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగూరు ప్రాజెక్టులో నీళ్లు లేక రైతులు పంటలు పండించుకోలేకపోతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో 40 వేల ఎకరాలకు నీరు అందించి రెండు పంటలు



పండించామని ఆయన గుర్తు చేశారు.

త్వరలో పాదయాత్ర

బసవేశ్వర-సంగమేశ్వర ప్రాజెక్టు సాధన కోసం త్వరలో పాదయాత్ర చేపట్టేందుకు సిద్దంగా ఉన్నానని, నావెంట నడిచే వాళ్లు సిద్దంగా ఉండాలని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సింగూరు కాలువల ద్వారా అందోలు, పుల్కల్ మండలాలకు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, బసవేశ్వర-సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే అందోలు నియోజకవర్గంలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. నారాయణఖేడ్‌లోని బోరంచ నుంచి జహీరాబాద్‌లోని రట్టజింతల్ సిద్ధివినాయక అలయం వరకు పాదయాత్ర చేసి కాంగ్రెసోళ్లకు జ్ఞానోదయం కలగాలని మొక్కుదామన్నారు. బసవేశ్వర -సంగమేశ్వర ప్రాజెక్టు పనులను ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బాలమల్లు, నియోజకవర్గ ఇన్‌చార్జి పట్నం మాణిక్యం, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో కోటి దాటిన ఉపాధ్యాయుల సంఖ్య

మొదటి తరువాయి



డ్రాపౌట్ శాతం తగ్గి, 1.8గా ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో స్కూళ్లలో విద్యార్థుల డ్రాపౌట్ శాతం 2.3 శాతంగా ఉండేది. మరోవైపు టీచర్ల సంఖ్య కూడా పెరుగుతూ ఉంది. 2022-23లో 94.8 లక్షల మంది టీచర్లు పనిచేయగా, 2024-25లో 1.01 కోట్ల మంది టీచర్లు స్కూళ్లలో పని చేశారు. ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటడాన్ని దేశ పాఠశాలల చరిత్రలో గొప్ప విజయంగా కేంద్ర విద్యాశాఖ అభివర్ణించింది. కేంద్రం అమలు చేస్తున్న సమగ్ర శిక్ష, నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ద్వారా ఇది సాధ్యమైందని తెలిపింది. మరోవైపు పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య కూడా తగ్గినట్లు వివరించింది. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగినప్పటికీ.. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం మాత్రం తగ్గింది. 2024-25లో ప్రభుత్వ పాఠశాలల్లో 12.1 కోట్ల మంది నమోదు చేసుకోగా, 2025-26లో 11.8 కోట్ల మంది నమోదు చేసుకున్నారు. ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య దాదాపు 30 లక్షలు పెరిగింది. దేశంలో సింగిల్ టీచర్ స్కూల్స్ 3 శాతం ఉన్నాయి. వీటిలో చాలావరకు విద్యార్థుల నమోదు శాతం సున్నాగా ఉంది. ఇలా ఒక్క విద్యార్థి లేని పాఠశాలల శాతం 2గా ఉంది.


# కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

మొదటి తరువాయి

కార్మికుల మరణానికి కారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆర్టీసీ కార్మికులకు భరోసా కల్పిస్తూ నిర్ణయాలు చేయడంతో పాటు కారుణ్య నియమాకాలు, పీఎఫ్ సదుపాయం కల్పిస్తూ చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించిన తర్వాత మహిళలకు వేల కోట్ల రూపాయల ఆదా కలిగిందన్నారు. ప్రతి మండల మహిళా సమాఖ్యను ఆర్టీసీ బస్సులకు ఓనర్లను చేశామని గుర్తు చేశారు. దేశంలోనే అతిపెద్ద సంస్థగా ఆర్టీసీని పురోగతిలోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో 10173 బస్సులు, 97 డిపోలు, 364 బస్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మందిని తమ తమ గమ్యాలకు చేరుస్తున్నామన్నారు. మహిళలకు 600 బస్సులు ఇచ్చామని, భవిష్యత్‌లోనూ బస్సు ఏదైనా మహిళలకే యాజమాన్య అవకాశం కల్పిస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. తమ ప్రభుత్వం రవాణా సంక్షేమం, అభివృద్ధి అనే రెండు అంశాలపై ముందుకు వెళుతుందని అభిప్రాయపడ్డారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో 200 కోట్లు వెచ్చించి జనరల్ ఆసుపత్రి రూ.5 కోట్లతో మహిళా సమాఖ్య భవనం, ఆర్టీఓ బిల్డింగ్, రూ.12 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నా రు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం పేరిట గత ప్రభుత్వం 8.30 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, కలెక్టర్ హేమంత్ పాటిల్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సునేంద్ర, మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, గ్రంథాలయ చైర్మెన్ రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## 'సుప్రీం'' వాతలు




ఒక దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్య. ఆ విద్యకు పునాది పాఠ్యపుస్తకాలు. అలాంటి పాఠ్యపుస్తకాలను రాజకీయ ప్రయోజనాల కోసం మార్చడమంటే ఒక తరం ఆలోచనలనే మార్చే ప్రయత్నం చేసినట్టే. గత దశాబ్దకాలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సిఈఆర్‌టి) పాఠ్యాంశాల్లో జరిగిన మార్పులు ఈ ఆందోళనకు బలం చేకూర్చాయి. చరిత్రను కుదించడం, శాస్త్రీయ దృక్పథాన్ని బలహీన పరచడం, పురాణాలను శాస్త్రంగా మలిచేందుకు ప్రయత్నించడం, రాజ్యాంగ విలువలకు విరుద్ధమైన భావజాలాన్ని చొప్పించడం వంటి చర్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ వైఖరికి చెంపపెట్టుగా నిలిచాయి. ఇటీవల ఎనిమిదో తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలో 'డి–రోల్ అఫ్ ది జ్యుడీషియరీ ఇన్ సొసైటీ' అధ్యాయంలో న్యాయవ్యవస్థ లోపాలు, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల ఖాళీల అంశాలు ఉండటంతో తీవ్ర వివాదా స్పదమైంది. వాస్తవానికి ఈ సమస్యలన్నీ పరిష్కరించాల్సింది కేంద్రమే. కానీ, తమ వైఫల్యాల్ని న్యాయవ్యవస్థకు అంటగట్టడం బాధ్యతను విస్మరించడమే. దీన్ని భారత అత్యున్నత న్యాయస్థానం గతంలోనే తప్పు పట్టింది. తాజాగా విద్యను రాజకీయ అవసరాలకు అనుగుణంగా మార్చడం, న్యాయవ్యవస్థకు మకిలి తీసుకు రావడం పట్ల పరోక్షంగా కేంద్రాన్ని హెచ్చరించింది. దీంతో ఎన్‌సిఈఆర్‌టి వెంటనే 'దిద్దుబాటు'కు పూనుకుంది. న్యాయ వ్యవస్థపై వివాదాస్పద అంశాల్ని తొలగించి కొత్త అధ్యాయాన్ని విడుదల చేసింది. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాలపై వరుసగా వివాదాలు చెలరేగాయి. మొదట 'హేతుబద్ధీకరణ' పేరుతో పాఠ్యాంశాలను తగ్గిస్తామని చెప్పినా, తొలగించిన అంశాలను పరిశీలిస్తే రాజకీయ ఉద్దేశాలు స్పష్టంగా కనిపించాయి. పదో తరగతి సిలబస్ నుంచి ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీలు, ప్రజా ఉద్య మాలకు సంబంధించిన పాఠాలు తగ్గించబడ్డాయి. 'గుజరాత్ అల్లర్లు--2002' ప్రస్తావన, 'మహాత్మాగాంధీ హత్య అనంతరం ఆరెస్సెస్‌పై నిషేధం' అనే అంశాల్ని తొలగించింది. మొఘల్ చరిత్రను గణనీ యంగా కుదించింది. ఈ మార్పులన్నీ చరిత్రను ఏకపక్షంగా చూపించే ప్రయ త్నాలని విద్యావంతులు, మేధావుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయిన ప్పటికీ కేంద్రం ఒంటెద్దు పోకడలు వీడలేదు. శాస్త్రీయ విద్యలో కూడా అశాస్త్రీయ భావాలకు చోటు కల్పించింది. ప్రాచీన భారతదేశంలో ప్లాస్టిక్ సర్జరీ, స్టెమ్ సెల్ టెక్నాలజీ, విమాన సాంకేతికత వంటి ఆధునిక విజ్ఞానాలన్నీ ఉన్నాయని రాజకీయ వేదికలపై చేసిన వ్యాఖ్యలు విద్యారంగంలో కూడా అలాంటి భావజాలాన్ని ప్రోత్సహించేలా కనిపించాయి. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020) అమలు నేపథ్యంలో పాఠ్యపుస్తకాల పునర్వ్యవస్థీకరణ పేరుతో 'భారతీయ జ్ఞాన సంపద'కు ప్రాధాన్యం ఇస్తామని కేంద్రం ప్రకటించింది. భారతీయ జ్ఞానాన్ని పరిచయం చేయడంలో అభ్యంతరం లేదు. కానీ దాన్ని శాస్త్రీయ ప్రమాణాలపై కాకుండా మతపరమైన, పురాణ ఆధారిత భావాలతో మేళవించడం విద్యకు హానికరం. శాస్త్రీయత, విశ్వాసం రెండింటి మధ్య తేడాను పిల్లలకు స్పష్టంగా బోధించడం అనివార్యం. ఆ గీత చెరిపేస్తే విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన బలహీనపడుతుంది. దేశంలోని ప్రముఖ చరిత్రకారులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఈ మార్పులపై పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్రను రాజకీయ అవసరాలకు అనుగుణంగా తిరగరాయడం, కొన్ని వర్గాల పాత్రను అతిశయోక్తిగా చూపడం, మరికొన్ని వర్గాల కృషిని పక్కనపెట్టడం విద్యాస్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్‌సిఈఆర్‌టి వంటి జాతీయ సంస్థ స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని కూడా సూచించారు. కానీ, కేంద్రం కనుసన్నల్లో పనిచేస్తున్న ఈ సంస్థ తన స్వతంత్రతను ఎప్పుడో కోల్పోయింది. రాజ్యాంగంలోని 51ఎ(హెచ్) ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథం, మానవతా భావం, పరిశోధనా స్వభావాన్ని పెంపొందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాడు. అదే బాధ్యత ప్రభుత్వానిది కూడా. కానీ శాస్త్రీయ అంశాలను తొలగించి, అశాస్త్రీయ భావాలకు ప్రాధాన్యమిస్తే అది రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు కేవలం ఒక పాఠ్యాంశంపై తీర్పు మాత్రమే కాదు. విద్యావ్యవస్థపై రాజకీయ రంగు పులమాలనే ప్రయత్నాలకు రాజ్యాంగం తరఫున ఇచ్చిన గట్టి హెచ్చరికగా భావించాలి. ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాలు ఏ పార్టీకి చెందినవిగా కాకుండా భారత రాజ్యాంగ విలువలకు అద్దం పట్టేవిగా ఉండాలి. విద్యార్థులకు నిజమైన చరిత్ర, ప్రజాస్వామ్య భావజాలం అందించడమే ప్రభుత్వ బాధ్యత. దాన్ని విస్మరిస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం సహజమే. విద్యను కాషాయీకరించే ప్రయత్నాలపై సుప్రీంకోర్టు చెప్పిన మాటలు దేశ ప్రజాస్వామ్యానికి, శాస్త్రీయ చైతన్యానికి ఒక ముఖ్యమైన భరోసా అని చెప్పకతప్పదు.

# జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధిపరిచే దిశగా డి పీ ఆర్ రూపొందించాలి.

**-పర్యాటకులు. మెచ్చే చారిత్రాత్మక ప్రదేశాలకు నిలయం మెదక్.**

**-రాష్ట్ర పర్యాటక శాఖ విడుదల చేసే నిధులతో మెదక్ టూరిజం సర్క్యూట్ కావడం తథ్యం.**

**-వడివడిగా అభివృద్ధి పనులు జరిగేలా పక్కా ప్రణాళికతో అధికారుల సమన్వయంతో పర్యాటక రంగ అభివృద్ధికి విశేష కృషి.**



**మెదక్ జిల్లా -08జూలై (మహాప్రభ )**
జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధిపరిచే దిశగా డి పీ ఆర్ రూపొందించాలని పర్యాటకులకు మెచ్చే టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసే దిశగా ఒడి ఒడిగా అభివృద్ధి పనులు జరగాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర టూరిజం శాఖ, జిల్లాలో వివిధ శాఖల అధికారులతో పర్యాటక అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పురావస్తు సంపద పరిరక్షణ, పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, అధికారతో సమీక్షించారు. పురావస్తు సంపద భద్రత, శాస్త్రీయ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి దేవాలయ అభివృద్ధి ఇటీవల టూరిజం శాఖ ద్వారా మంజూరు చేసిన 07 కోట్ల రూపాయల వ్యయంతో కాటేజీల నిర్మాణం చేపట్టాల్సిన పనులపై టెంపుల్ మాస్టర్ ప్లాన్ అధికారులతో చర్చించి , సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఆలయ చారిత్రక, పర్యాటక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు అనంతరం మెదక్ ఖిలా, పోచారం డ్యామ్, బారాకమాన్, గోల్ బంగ్లా, మిగతా చారిత్రాత్మక ప్రదేశాలు ప్రస్తుతం చేపట్టాల్సిన అభివృద్ధి, పరిరక్షణ పనుల డిపిఆర్ రూపొందించి తద్వారా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలోని చారిత్రక, వారసత్వ ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కిలాకోట అభివృద్ధికి 57 లక్షల రూపాయలు, అలాగే ఏడుపాయల టెంపుల్ కాటేజి నిర్మాణాలకు ఏడు కోట్ల రూపాయలు రాష్ట్ర టూరిజం శాఖ మంజూరు చేసిన విషయం మనందరికీ తెలిసిన విషయమైతే పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించే విధంగా టూరిజం శాఖ, ఇతర శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమస్యలను నివృత్తి చేసుకుంటూ ప్రజలను మమేకం చేస్తూ పర్యాటకులకు మెచ్చే విధంగా మెదక్ ను టూరిజం సర్క్యూట్ రూపొందించి రాష్ట్రంలోనే మెదక్ ను టూరిజం సర్క్యూట్ తల మానికంగా తయారుచేసి ముందు వరుసలో ఉంచేందుకు పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ ,తెలంగాణ టూరిజం ప్రతినిధులు రామకృష్ణ, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఈ. ఈ శ్రీశైలం, కన్సల్టెన్సీలు అమృత, జిల్లా అధికారులు డీఎఫ్ఓ జోజి, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, ఏడుపాయల టెంపుల్ ఈవో వీరేశం, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ రాక ఆటోలో ప్రసవం


**పుట్టిన కాసేపటికే నలుగురు శిశువుల మృతి**

**బీజేపీ పాలిత ఎంపీలో ఘటన**



**భోపాల్ జూలై 8 (మహాప్రభ)**
సమయానికి అంబులెన్స్ రాకపోవడంతో ఆటో లో దవాఖానకు వెళ్తూ ఒక మహిళ నలుగురు కవలలకు జన్మనిచ్చిన ఘటన బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో జరిగింది. అయితే నలుగురు ప్రీమెచ్యూర్ బేబీలు పుట్టిన కొద్దిసేపటికే మరణించారు. మాండ్ల జిల్లా నైనగ్వాలో మంగళవారం ఈ ఘట న చోటుచేసుకుంది. ఏడో నెల గర్భ ంతో ఉన్న 28 ఏండ్ల రజినీ సింగారానికి నొప్పులు రావడంతో ఆమె కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కోసం ప్రయత్నించారు. అయితే అంబులెన్స్ రాకపోవడం తో ఆటోలో దవాఖానకు వెళ్తుండగా, నొప్పులు వచ్చి నలుగురు కవలలకు ఆటోలోనే జన్మనిచ్చింది. అయితే నలుగురు బిడ్డలు మరణించారని డాక్టర్లు ప్రకటించారు. సమయానికి అంబులెన్స్ రాకపోవడం వల్లే తన భార్య నలుగురు శిశువులను పోగొట్టుకున్నదని, దీనికి ప్ర భుత్వ సేవా లోపమే కారణమని బాధితురాలి భర్త ఆరోపించారు.

## పినాక పరీక్ష సక్సెస్



**భువనేశ్వర్ జూలై 8 (మహాప్రభ)**
భారత రక్షణ వ్యవస్థ మరో మైలురాయిని అందుకుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. డీఆర్డీవో బుధవారం ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ రాకెట్‌ను స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేశామని, దీనికి నిర్దేశించిన అన్ని లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసిందని రాజ్‌నాథ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 డిసెంబర్‌లో ఇదే రాకెట్ ను 120 కిలోమీటర్ల పరిధిలో ప్రయోగించారు. ప్రస్తుతం ఈ రాకెట్ పరిధి 60 కిలోమీటర్ల నుంచి 120 కిలోమీటర్ల మధ్యలో ఉంది. ఈ ప్రయోగంతో రక్షణ వ్యవస్థకు మరింత బలం చేకూరిందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.

## జూలై 10న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి



**మెదక్ జిల్లా -08జూలై(మహాప్రభ )**
ఈనెల 10న(శుక్రవారం) ఏఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన విద్యా సంస్థల బంద్ కు జిల్లాలోనీ అన్ని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పూర్తి సహకారం అందించాలనీ ఏఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రచాకలి పాపయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం -- ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈబంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలనీ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావాలనీ సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలనీ తెలిపారు. నాణ్యమైన,ఉచిత విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనీ జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు,యువత, తల్లిదండ్రులు,ప్రజా స్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా చిట్కుల మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**-ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు పండ్లు పంపిణీ**

**-కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించిన లయన్ డాక్టర్ అప్సర్ భాయ్**

**-అభిమానుల శుభాకాంక్షల వెల్లువ**



**మనోహరాబాద్, జులై 8 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిట్కుల మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం తూప్రాన్--మనోహరాబాద్ ప్రాంతాల్లో ఆయన అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జన్మదిన కేక్‌ను కట్ చేసి, మహిపాల్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి లయన్ డాక్టర్ అప్సర్ భాయ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాసేవా భావంతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ అప్సర్, బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తూప్రాన్ మాజీ సర్పంచ్ వెంకటేశం గుప్తా, ఎండి ఉమర్, చిట్టిమల్ల అనిల్, గాండ్ల వీర్, కొక్కొండ లక్ష్మారెడ్డి, ఎండి సమీర్, ఎండి అజార్, కొక్కొండ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని మహిపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ చిట్కుల మహిపాల్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో, అభిమానుల సందడితో ఘనంగా జరిగింది. ౦

# ఎస్ఎస్ఆర్ కార్యక్రమంలో ఓటర్లకు అవగాహన కల్పించిన సిద్ధం ప్రవీణ్ మహేశ్వర్ రెడ్డి





**గడ్డిఅన్నారం - జూలై 8 (మహాప్రభ )** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని న్యూ గడ్డిఅన్నారం కాలనీలో బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఉద్దేశ్యం, ఎన్యుమరేషన్ ఫారమ్‌ల ప్రాముఖ్యత, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లకు బీ ఎల్ ఓ లు సమర్పించాల్సిన అవసరంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. సంబంధిత బీ ఎల్ ఓ ల సహకారంతో



నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్లు బి ఎల్ ఏ 2 జ్యోతి, మురళి పాల్గొని ఓటర్లకు అవసరమైన సూచనలు అందించారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు లేదా చేర్పులు అవసరమైతే ఎన్యుమరేషన్ ఫారమ్ ద్వారా నమోదు చేసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలంటే ఓటరు జాబితాలో తన వివరాలను సరిచూసుకోవడం అత్యంత అవసరమని అన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సంబంధిత బి ఎల్ ఓ లను సంప్రదించి సరైన సమాచారం తెలుసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటరి భాగస్వామ్యం ఎంతో కీలకమని, అందరూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పూర్తి చేసి సమర్పించాలని ఆయన పిలుపునిచ్చారు.

## బోస్టన్‌లో సోదరుడి కుమార్తె వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.



**ఎల్ బి నగర్ - జూలై 8 (మహాప్రభ)** అమెరికాలోని బోస్టన్ నగరంలో నిర్వహించిన తన సోదరుడి కుమార్తె వివాహ మహోత్సవంలో ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యాభివృద్ధులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.వివాహ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మమేకమై వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు తన ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బంధువులు, స్నేహితులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# కొండమల్లేపల్లి లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళి

**దేవరకొండ జూలై 8 ( మహాప్రభ )** నియోజకవర్గంలోని కొండమల్లేపల్లిలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కొండమల్లేపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. రైతు, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఆయన ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతులకు



రుణ సౌకర్యాలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ గృహాలు, 108 అంబులెన్స్ సేవలు, 104 ఆరోగ్య సేవలు, జలయజ్ఞం వంటి ప్రజా సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన దూరదృష్టి గల నాయకుడు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ని అన్నారు. ఆయన నాయకత్వంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అమలు చేసి రాష్ట్రానికి విశేష సేవలందించిందని తెలిపారు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం నిరంతరం శ్రమించిన నిజమైన ప్రజానాయకుడని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని, వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, యువజన కాంగ్రెస్ నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళులు

**దేవరకొండ జూలై 8 ( మహాప్రభ )** దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన పటానికి లిదేవరకొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మారపాకుల సురేష్ గౌడ్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత రాజశేఖర్ రెడ్డి చేసిన ఎంతో మంచి పనులను గుర్తు చేస్తూ ఆయన ఆశాభావాలను ఎంతో శ్రేయస్సు కరమని కొనియాడారు ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్నా శైలజ వెంకటేశ్వర్లు చందంపేట మండలం అధ్యక్షులు మల్లారెడ్డి దేవరకొండ మునిసిపల్ 7 వ,వార్డ్ కౌన్సిలర్ హనుమంతు సాయి చంద్ర గౌడ్‌లి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర కృష్ణ లచ్చిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు




# ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**- అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు పంపిణీ చేసిన భవాని ప్రవీణ్ కుమార్.**

**గడ్డిఅన్నారం, జూలై 8 (మహాప్రభ)** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటిస్తూ అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్‌లను అందజేశారు. డివిజన్‌లో పలువురు ఓటర్లకు ఇంకా ఎన్యుమరేషన్ ఫామ్‌లు అందలేదనే సమాచారాన్ని తెలుసుకున్న ఆయన వెంటనే సంబంధిత వార్డు అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించి, ఏయే ప్రాంతాల్లో పంపిణీ పెండింగ్‌లో ఉందో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులను





వెంటబెట్టుకుని కాలనీల్లో పర్యటిస్తూ ఫామ్‌లు అందని ఇళ్లను గుర్తించి, అక్కడికక్కడే అధికారుల ద్వారా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్‌లను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా భవాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడి ఓటు అమూల్యమైనదని, ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫామ్‌లను పూర్తిగా నింపి నిర్ణీత గడువులోపు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లకు అందజేయాలని కోరారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన సమాచారం తెలుసుకోవాలని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా తాము నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వార్డు అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పురుగుమందులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ జూలై 8 ( మహాప్రభ )** కొండమల్లెపల్లి మండల కేంద్రంలో రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్, కొండమల్లెపల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ రిటైల్ ఔట్‌లెట్ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఒకేచోట అందుబాటులో ఉండే విధంగా సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందించి వారి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత, దేవరకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, నల్లగొండ పార్లమెంటు కోఆర్డినేటర్ ఎంఎ సిరాజ్ ఖాన్, పీఎసీఎస్ చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ దూదిపాల శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్ రెడ్డి, సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో

# ప్రతి అర్హ ఓటు జాబితాలో ఉండేలా చూడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత

**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**దేవరకొండ జూలై 8 ( మహాప్రభ )** దేవరకొండ నియోజకవర్గంలోని పీఏ పల్లి మండల కేంద్రం మరియు బాలాజీ నగర్ బూత్‌లను దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్) కార్యక్రమాన్ని పరిశీలిస్తూ బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ ఎ లు), బూత్ లెవల్ అధికారులు (బిఎల్ ఓ లు) మరియు ఓటర్లతో నేరుగా మాట్లాడి ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటు హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు.

అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బిఎల్ ఎ ల పై ఉందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో నింపించి సమర్పించాలని సూచించారు.

అనంతరం బూత్‌లలో విధులు నిర్వహిస్తున్నలుతో బి ఎల్ ఓలు మాట్లాడి ఎన్యుమరేషన్ ఫారాలను



ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారో, ఎదురవుతున్న సమస్యలు ఏమిటో అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగంగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఓటర్ల సందేహాలను స్వయంగా నివృత్తి చేస్తూ సరప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదే కార్యక్రమం అనంతరం పీఏ పల్లి మండల కేంద్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత అని కొనియాడారు. "ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, రైతు సంక్షేమం" వంటి ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.

నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలినాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే సంక్షేమ స్ఫూర్తితో "రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత సన్నబియ్యం పంపిణీ, రైతు సంక్షేమం, మహిళా సాధికారత" వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైయస్సార్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కార్యరూపంలో చూపిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏ పల్లి మరియు గుడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బిఎల్ ఎ లో, బి ఎల్ ఓ లు, ఓటర్లు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోర్‌బందర్ తీరంలో కూలిన 'దృష్టి-10' డ్రోన్

**-తప్పిన ప్రాణ నష్టం.. దర్యాప్తునకు ఆదేశాలు**

**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)** భారత నౌకాదళానికి చెందిన 'దృష్టి-10' మానవరహిత విమానం(యూఏవీ/డ్రోన్) గుజరాత్‌లోని పోర్‌బందర్ సమీపంలో బుధవారం కూలిపోయింది. శిక్షణ సమయంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నదని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని, ఎవరికీ గాయాలు కాలేదని నౌకాదళ అధికారులు తెలిపారు.ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించినట్లు 'ఎక్స్' వేదికగా నౌకాదళ ప్రతినిధి వెల్లడించారు. నౌకాదళం పర్యవేక్షణ అవసరాల కోసం వినియోగించే 'దృష్టి-10 డ్రోన్'కు ఇజ్రాయెల్‌కు చెందిన 'ఎల్బిట్ సిస్టమ్' భాగస్వామ్యంతో 'అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్' సంస్థ రూపకల్పన చేసింది.

### రూ.75 లక్షలతో ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల నూతన వసతి గృహానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శంకుస్థాపన





**దేవరకొండ జూలై 8 ( మహాప్రభ )**
దేవరకొండ నియోజకవర్గం లోని పీఏ పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన వసతి గృహ భవన నిర్మాణ పనులకు దేవరకొండ ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సంబంధిత అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు సమావేశనికి హాజరైన జె. ఎన్టీ యూ. హెచ్ ఉద్యమ నాయకులు.



**హైదరాబాద్ జూలై 8'( మహా ప్రభ)**
ఈ రోజు బుధవారం రోజున హైదరాబాద్ లోని తెలంగాణ అమరుల స్మారక భవనంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉద్యమకారుల గుర్తింపు సమావేశం జరగగా కమిటీ సభ్యులు అయిన కె. కేశవరావు, ప్రొపెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, శోభన్ రెడ్డి ల కమిటీ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీ లో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి నియమ నిబంధనలు సలహాలు సూచనల కోసం సమావేశం ఏర్పాటు చేయగా జెఎన్టీయూహెచ్ నుండి డా. కరుణాకర్ రెడ్డి, ఎరవెల్లి జగన్, అశోక్ గౌడ్, అప్పల శ్రీకాంత్, శ్రీను నాయక్ లు పాల్గొని ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలనీ, ఉద్యమం చేసి అనేక రకాలుగా ఇబ్బందాలు పడుతున్న ఉద్యమకారులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిగించి కాంగ్రెస్ పార్టీ మేనిపెస్టో లో పెట్టిన హామీలు అన్ని నెరవేర్చాలని దానికి సంబంధించిన చర్చలో సరైన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. కమిటీ సభ్యులు మాట్లాడుతు అందరు సూచనలు సలహాలు పరిగినలలోకి తీసుకోని తుది నివేదిక తయారు చేసి ప్రభుత్వం ద్వారా న్యాయం చేపిస్తామని కమిటీ సభ్యులు తెలియజేసారు.

# ఓటరు సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

**-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాగ్వన్ ....,**





**గాంధారి, జూలై 8 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాగ్వన్ బుధవారం గాంధారి మండల కేంద్రంలో పర్యటించినారు ఓటర్ సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్న బిఎల్ఓ తో మాట్లాడుతూ.. ఒక ఓటర్ నమోదుకు ఎంత సమయం పడుతుంది అని, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.. ఎంపీపీ ఎస్ బాలిక పాఠశాలలో వనమా ఉత్సవం లో భాగంగా మొక్కలను నాటారు, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ప్రభాకర్, జిల్లా విద్యాధికారి, మల్లికార్జున్, డి ఎల్ పి ఓ రాజేంద్రప్రసాద్, గాంధారి ఎమ్మార్వో రేణుక చౌహన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఏపిఎం ప్రసన్నకుమార్, గాంధారి గ్రామ సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, సొసైటీ చైర్మన్ సాయికుమార్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, మాజీ సర్పంచ్ సంజీవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆశ వర్కర్స్, మహిళలు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు..

## బీసీ గురుకుల సొసైటీ నల్లగొండ ఆర్ఓ స్వప్నపై

# విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



**దేవరకొండ జూలై 8 ( మహాప్రభ )**
నల్గొండ జిల్లా బీసీ గురుకుల సొసైటీ ఆర్సి ఓ ఈ.స్వప్న గారిపై ఇదివరకే డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఎంజేపీ గురుకుల సొసైటీ సెక్రటరీ,ప్రిన్సిపల్ సెక్రటరీ లకు పిర్యాదు చేసిన విషయం తెలిసిందే.అదే పరంపరగా నేడు బుధవారం కలెక్టరేట్ ఆఫీస్ లోఎంజేపీ బీసీ గురుకుల నల్గొండ జిల్లా ఆర్సి ఓ ఈ. స్వప్న యొక్క అక్రమాలు, అరాచకాల పై విచారణ జరపాలని నల్గొండ జిల్లా కలెక్టర్ శ్రీ బడుగు చంద్రశేఖర్ కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్,జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మి నారాయణ కుపిర్యాదు చేశారు. ఈ సందర్భముగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్సి ఓ ప్రధానంగా నల్లగొండ జిల్లాలో కావాలనే ఇంటర్మీడియట్ లోని సీఈసీ గ్రూపులో సీట్లు భర్తీ చేయకపోవడం, అహంకారపూరితమైన, కుట్రపూరితంగా, దురుద్దేశంతో వ్యవరించడం ,దురుసు ప్రవర్తన, కుల వివక్ష, ఇంటర్మీడియట్ అడ్మిషన్ విషయాల్లో పారదర్శకత లేకపోవడం, సమయపాలన పాటించకపోవడం, ప్రజలకు విద్యార్థులకు, బీసీ ఉద్యమ నాయకులకు అందుబాటులో ఉండకపోవడం, విద్యార్థులు వారి తల్లిదండ్రుల పై దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్యకరమైన పదజాలంతో రెచ్చిపోవడం , డేమోల పేరిట డబ్బు దన్నుకోవడం మరియు బీసీ గురుకుల లోనే పనిచేస్తే బీసీ వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు అని అన్నారు. మరియు ఈ ఫిర్యాదులో ఆమె చేసిన అక్రమాల చిట్టాను, అవినీతిని ప్రశ్నిస్తూ స్పష్టంగా కలెక్టర్ కి కల్సి వివరించారు.ఈ పిర్యాదు పత్రాన్ని మీడియా ముందు పెట్టారు.ఈ పిర్యాదు కలెక్టర్ గారు పరిశీలించిన పిమ్మట ఆర్సిఓ గారి అక్రమాలపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ గారు బీసీ సంక్షేమ సంఘానికి హామీ ఇచ్చారని ఒక వారం రోజుల్లోనే ఆమె పై తగు చర్యలు ఉంటాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఒక వేళ వారం రోజుల్లో ఆమెను సస్పెండ్ చేయకపోతే పెద్దయెత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని వారు తెలియజేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకులు గుండు వెంకటేశ్వర్లు ,జెర్రిపోతుల రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఎఫ్ఎంజీఈలో విజయఢంకా మోగించిన కలవల సుప్రజ

**-బోనకల్ మండలానికి జాతీయ స్థాయిలో గుర్తింపు..**
**-యువతకు ఆదర్శంగా నిలిచిన ప్రతిభ**



**బోనకల్, జూలై 8'(మహాప్రభ)**
పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని బోనకల్ మండలానికి చెందిన కలవల సుప్రజ మరోసారి నిరూపించారు. విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన విద్యార్థులు భారతదేశంలో వైద్య వృత్తిని చేపట్టేందుకు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన ఎఫ్ఎంజీఈ (Foreign Medical Graduate Examination) పరీక్షలో విజయం సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ జాతీయ స్థాయి పరీక్ష అత్యంత పోటీతో కూడుకున్నదిగా భావిస్తారు. విదేశాల్లో వైద్య విద్య పూర్తిచేసిన అభ్యర్థుల వైద్య పరిజ్ఞానం, క్లినికల్ నైపుణ్యం, వృత్తిపరమైన సామర్థ్యాన్ని అంచనా వేసే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం అంత సులభం కాదు. అలాంటి పరీక్షలో కలవల సుప్రజ ప్రతిభ కనబరచడం ఆమె కృషి, అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది.
సుప్రజ సాధించిన విజయం వ్యక్తిగత విజయమే కాకుండా బోనకల్ మండలంలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చని ఆమె నిరూపించారని విద్యావేత్తలు పేర్కొన్నారు. లక్ష్యంపై స్పష్టత, సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర సాధన విజయానికి మూల సూత్రాలని వారు అభిప్రాయపడ్డారు.
ఈ సందర్భంగా కలవల సుప్రజ మాట్లాడుతూ, తన విజయానికి తల్లిదండ్రుల అపారమైన ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం, కుటుంబ సభ్యుల సహకారం ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి విద్యార్థి అపజయాలను చూసి నిరుత్సాహపడకుండా వాటిని విజయానికి పునాదులుగా మార్చుకోవాలని సూచించారు. చదువుపై అంకితభావంతో ముందుకు సాగితే ప్రతి కల సాకారమవుతుందని అన్నారు.
భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని సుప్రజ పేర్కొన్నారు. ఆమె విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. బోనకల్ మండలానికి చెందిన మరెందరో విద్యార్థులు సుప్రజను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు.

### దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ఆదేశానుసారం కంబాలపల్లి లో ( సర్ )ప్రత్యేక ఓటర్ల సవరణ.





**దేవరకొండ డివిజన్ జులై 8 ( మహాప్రభ**
చందంపేట మండలం కంబాల పల్లి గ్రామపంచాయతీ లో కార్యక్రమాన్నిపరిశీలించిన చందంపేట మాజీ ఎంపీపీ ఏడుపుల గోవింద్ యాదవ్ బిఎల్వోలతో పాటు కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కూడా బిఎల్ఓలకు సహకరించాలి గ్రామంలో పెద్ద ఎత్తున ఓటర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు ఓటర్ సవరణ కార్యక్రమానికి ఉప సర్పంచ్ చిమట ముత్తయ్య యాదవ్ మరియు బిఎల్ఏ గోనుగుంట్ల గోవిందు జిపిఓ మరియు సీనియర్ అసిస్టెంట్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామంలో ఉన్న ప్రతి ఓటర్ కూడా వారి యొక్క ఆధార్ కార్డును కలర్ పాస్ ఫోటోను మీకి అందజేసిన ఎనిమరేషన్ ఫామ్ కు జతపరిచి బిఎల్ఓ లకి అప్పజెప్పి ఎప్పటికప్పుడు రాసిన ఫారంలను పూర్తి చేసి ఆన్లైన్ చేయాలని కోరారు దేవరకొండ మరియు హైదరాబాదు ఉగుంటూరు సుదూర ప్రాంతాలలో ఉన్న కంభాలపల్లి ఓటర్ మహాశయులందరు కూడా వారి యొక్క పాస్ ఫోటోలు మరియు ఆధార్ కార్డు జిరాక్స లను సంబంధిత బిఎల్ఓ లకి అందజేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు,అందజేయని వారు ఓటు నిర్ధాక్షణంగా తొలగించబడుతుంది.

## గగన్‌యాన్ 'పారాచూట్' పరీక్ష విజయవంతం



**న్యూఢిల్లీ జూలై 8 (మహాప్రభ)**
భారత ప్రతిష్టాత్మక 'గగన్‌యాన్' మానవ సహిత అంతరిక్షయాత్రలో ఇస్రో మరో కీలక మైలురాయిని అధిగమించింది. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చే వ్యోమగాముల క్యాప్సూల్(నౌక) వేగాన్ని నియంత్రించి, సురక్షితంగా భూమికి చేర్చే ప్రధాన పారాచూట్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించింది.త్వరలో నిర్వహించబోయే గగన్‌యాన్ తొలి ప్రయోగానికి ముందుగా ఈ ప్రయోగం విజయవంతం కావడం ఈ ప్రాజెక్టు భద్రతా ప్రమాణాలపై మరింత నమ్మకాన్ని పెంచింది. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్‌లోని ఏరియల్ డెలివరీ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ డ్రాప్ జోన్‌లో ఈ పరీక్ష నిర్వహించారు.

# ఉద్యోగం పేరుతో రూ.8.80 లక్షలు, ల్యాప్‌టాప్ మోసం..

**- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు**

**శివంపేట, జూలై 8(మహాప్రభ):**
ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.8.80 లక్షల నగదు, ఒక హెచ్‌పీ ల్యాప్‌టాప్ తీసుకుని మోసం చేశారంటూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. శివంపేట మండల పరిధిలోనిభీమ్లా తండాకు చెందిన మాలోత్ సంతోష్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. గత మార్చి 2025లో తనకు పరిచయమైన చౌహాన్ సునీల్ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ సంస్థలో మంచి జీతంతో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అదే హామీతో బీటెక్ చదువుతున్న నవీన్‌కు కూడా ఉద్యోగం కల్పిస్తానని చెప్పి ఇద్దరి నుంచి విడతల వారీగా నగదు, ఆన్‌లైన్ బదిలీల రూపంలో మొత్తం రూ.8.80 లక్షలు, ఒక హెచ్‌పీ ల్యాప్‌టాప్ తీసుకున్నట్లు పేర్కొన్నాడు. అయితే ఇప్పటి వరకు ఉద్యోగం కల్పించకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని ఫిర్యాదులో ఆరోపించాడు. అనంతరం సంబంధిత సంస్థ గురించి విచారించగా, అక్కడ సునీల్ అనే వ్యక్తి లేడని తెలిసిందని తెలిపాడు.తనను, నవీన్‌ను ఉద్యోగం పేరుతో మోసం చేసిన చౌహాన్ సునీల్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని, తమ నుంచి తీసుకున్న నగదు, ల్యాప్‌టాప్‌ను తిరిగి ఇప్పించాలని బాధితుడు పోలీసులను కోరాడు. ఈ మేరకు పోలీసులు ఫిర్యాదును స్వీకరించి విచారణ చేపట్టినట్లు సమాచారం.

## పేదవాడి గుండె చప్పుడు వైఎస్సార్.

**-హాఫీజ్ ఉద్దీన్.**



**మెదక్ జిల్లా -08జూలై (మహాప్రభ ).**
పేదవాడి గుండె చప్పుడు, చిరునవ్వుల రారాజు దివంగత ముఖ్యమంత్రి అని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫీజ్ ఉద్దీన్ అన్నారు.మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం హాఫీజ్ ఉద్దీన్ మాట్లాడుతూ.. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా నిరంతరం పనిచేసిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాల ద్వారా పేదలు, విద్యార్థులు, రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం వెనుక పేదవాడిపై ఉన్న అపారమైన ప్రేమ, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత ప్రతిబింబిస్తుందని అన్నారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, ప్రతి పేదవాడి ఇంటిలో, ప్రతి రైతు గుండెల్లో ఆయన జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. మహానేత ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని హాఫీజ్ ఉద్దీన్ పేర్కొన్నారు.

# బిజినెస్

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు..

**-మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు మాయం..!**

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కుప్పకూలాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక్క ప్రకటనతో సూచీలు అమాంతం పతనమయ్యాయి. ఈ అనూహ్య పరిణామాలతో దాదాపు రూ.8 లక్షల కోట్ల మేర మదుపర్ల సంపద ఆవిరైంది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా దిగజారగా.. నిఫ్టీ 24 వేల మార్క్‌ను కోల్పోయింది.పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఉదయం సూచీలు నష్టాలతోనే ప్రారంభమయ్యాయి. క్రితం ముగింపు (78,180) తో పోలిస్తే దాదాపు 400 పాయింట్ల నష్టంతో 77,816 వద్ద సెన్సెక్స్ నేడు ట్రేడింగ్‌ను ప్రారంభించింది. మధ్యాహ్నం వరకు ఒడుదొడుకులతోనే సాగిన సూచీ.. ఆ తర్వాత కుప్పకూలింది. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసిందంటూ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్ల బ్లడ్‌బాత్‌కు దారితీసింది. కేవలం 30 నిమిషాల్లోనే సెన్సెక్స్ 1000 పాయింట్లు తగ్గింది. ఒక దశలో 1800 పాయింట్లకుపైగా పతనమైన సూచీ.. మార్కెట్



ముగిసే సమయానికి 1677.12 పాయింట్లు క్షీణించి 76,503.60 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 516.65 పాయింట్ల నష్టంతో 23,882.05 వద్ద ముగిసింది. దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకీ, హిందుస్థాన్ యునీలివర్ షేర్లు భారీగా పడిపోయాయి. ఓఎన్జీసీ, హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో స్వల్పంగా లాభపడ్డాయి. జియో ఫైనాన్షియల్ షేరు 12 శాతం మేర కుంగింది.అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం మధ్యాహ్నం ట్రంప్ స్పందిస్తూ.. టెహ్రాన్‌తో కాల్పుల విరమణ ముగిసిందని ప్రకటించారు. ఆ దేశంతో చర్చలు జరపడం కూడా వృథా అని పేర్కొన్నారు. దాంతో మళ్లీ యుద్ధభయాలు నెలకొన్నాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఆరు శాతం పెరిగి 78.56 డాలర్లకు చేరింది. రూపాయి విలువ మరింత క్షీణించింది.

## జోరుగా ఈవీ అమ్మకాలు.. జూన్‌లో ఆల్‌టైమ్ హైగా నమోదు

**మొత్తం వాహనాల్లో 12% విద్యుత్తు ఆధారితమే**



**న్యూఢిల్లీ,**

దేశంలో విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) వినియోగం ఊపందుకుంటున్నది. గత నెలలో మునుపెన్నడూ లేనివిధంగా ఈవీల రిటైల్ విక్రయా లు జరిగాయి మరి. జూన్‌లో ఆల్‌టైమ్ హై రికార్డును సృష్టిస్తూ ఏకంగా 3 లక్షల మార్కును దాటి 3,06,220 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది జూన్‌తో పోల్చితే అమ్మకాల్లో 63 శాతం వృద్ధి కనిపించింది. అంతేగాక ప్రస్తుతం వినియోగంలో ఉన్న వాహనాల్లో 12 శాతానికిపైగా ఈవీలేనని ఈ స్థాయిలో లెక్క తేలడం ఇదే తొలిసారి అంటూ ఆటోమొబైల్ డీలర్ల సంఘ సమాఖ్య (ఫడా) అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.


**టూవీలర్లదే పైచేయి**

ఈవీల కొనుగోళ్లలో టూవీలర్లదే పైచేయిగా ఉన్నది. గత నెలలో 1,98,735 యూనిట్లు అమ్ముడయ్యాయి. నిరుడు జూన్‌లో 1,10,719 యూనిట్లే. దీంతో ఈసారి 74.98 శాతం వృద్ధి నమోదైందని ఓ ప్రకటనలో ఫడా వెల్లడించింది. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వెహికిల్ రిటైల్ సేల్స్ కూడా 15,318 యూనిట్ల నుంచి 31,823 యూనిట్లకు పెరిగాయి. అలాగే త్రీవీలర్ ఈవీల అమ్మకాలు ఈసారి 77,448 యూనిట్లుగా ఉంటే.. పోయినసారి 60,802 యూనిట్లుగా ఉన్నాయి. వాణిజ్య వాహనాల్లోనూ ఈవీల వినియోగం పెరుగుతుండటం విశేషం. ఏడాది వ్యవధిలో 1,219 యూనిట్ల నుంచి 3,214 యూనిట్లకు చేరాయి.

# నథింగ్ నుంచి 4బి ఫోన్ విడుదల..

**కీలక ఫీచర్లు, ధర వివరాలివి**

నథింగ్ నుంచి వచ్చే ఫోన్లకు ప్రత్యేక క్రేజ్ ఉంటుంది. వీటి డిజైన్ ప్రధాన ఆకర్షణ. ఇప్పటికే నథింగ్ నుంచి 4ఏ సహా వివిధ మోడల్ ఫోన్లు విడుదలయ్యాయి. ఇప్పుడు వీటి తర్వాతి వెర్షన్‌గా 4బి పేరుతో కొత్త ఫోన్ విడుదల చేసింది నథింగ్. ఇది బి సిరీస్‌లో వస్తున్న తొలి నథింగ్ మొబైల్ ఫోన్. ఇందులోనే ఐపీఎల్ టీం అయిన ఆర్సీబీ ఫ్యాన్స్ కోసం నథింగ్ 4బి ఆర్సీబీ ఎడిషన్‌ను కూడా తీసుకొచ్చింది. ఈ మోడల్ మాత్రం ప్రస్తుతం బెంగళూరులోని నథింగ్ స్టోర్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.భవిష్యత్తులో ముంబై ఇండియన్స్ వంటి ఇతర టీంల ఎడిషన్స్ కూడా వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. జూలై 14 నుంచి



ఫ్లిప్‌కార్ట్‌తోపాటు వివిధ రిటైల్ స్టోర్లలో అందుబాటులో ఉంటుంది. ఆర్సీబీ ఎడిషన్ మాత్రం జూలై 7 నుంచి బెంగళూరు స్టోర్లలో మాత్రమే ఉంటుంది. నథింగ్ 4బిలోని ఫీచర్లివే. 6.77 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్జ్ రిఫ్రెష్‌రేట్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 6 జనరేషన్ 4 చిప్‌సెట్, గ్లైఫ్‌బార్ ఇంటర్‌ఫేస్, ఆండ్రాయిడ్ 16 విత్ నథింగ్ 4.1 ఓఎస్, ఏఐ పవర్డ్ ఫీచర్స్, ఇన్‌డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్, 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ ఛార్జింగ్ ఫీచర్, 1,200 ఛార్జింగ్ సైకిల్స్ హెల్తీ, 27 నిమిషాల్లోనే 50 శాతం ఛార్జింగ్, 80 నిమిషాల్లో ఫుల్ ఛార్జింగ్, 50ఎంపీ సామ్‌సంగ్ మెయిన్ కెమెరాం8ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 16ఎంపీ సెల్ఫీ కెమెరా, ఐపీ64 రేటింగ్, 8జీబీం128జీబీ, 8జీబీం256జీబీ వంటి ఫీచర్లున్నాయి. ధరలు రూ. 34,999/రూ.38,999. అయితే, వివిధ డిస్కౌంట్లు, బ్యాంక్ ఆఫర్లతో రూ.29,999/రూ. 33,699లకు పొందవచ్చు. బ్లాక్, వైట్, బ్లూ కలర్స్‌లో లభ్యం.

# స్పోర్ట్స్

# తిలక్ వర్మ స్టంపింగ్‌పై రచ్చ..


**-అంపైర్ నిర్ణయం సరైందేనా, ఐసీసీ నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

భారత్--ఇంగ్లాండ్ మధ్య జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అవుటైన తీరు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. వికెట్ కీపర్ జోస్ బట్లర్ చేసిన స్టంపింగ్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అంపైర్ తప్పు నిర్ణయం ఇచ్చారంటూ కొందరు అభిమానులు విమర్శలు గుప్పిస్తుండగా, మరికొందరు మాత్రం నిబంధనల ప్రకారమే నిర్ణయం తీసుకున్నారని అభిప్రాయపడుతున్నారు. నాటింగ్‌హామ్‌లోని ట్రెంట్ బ్రిడ్జ్ మైదానంలో 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. ఆరంభంలోనే వరుస వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు.ఇంగ్లాండ్ స్పిన్నర్ విల్ జాక్స్ వేసిన ఒక బంతిని భారీ షాట్ ఆడేందుకు తిలక్ క్రీజు వదిలి ముందుకు వచ్చాడు. అయితే బంతిని పూర్తిగా మిస్ కావడంతో అది నేరుగా వికెట్ కీపర్ జోస్ బట్లర్



చేతుల్లోకి వెళ్లింది. వెంటనే స్పందించిన బట్లర్ వికెట్లను పడగొట్టాడు. బట్లర్ వికెట్లను పడగొట్టిన వెంటనే బంతి అతని గ్లోవ్స్ నుంచి జారి నేలపై పడింది. దీంతో తిలక్ వర్మ నాటౌట్ అని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు వెల్లువెత్తాయి. బంతి చేతిలో లేకుండానే స్టంపింగ్ పూర్తి చేశారని అభిమానులు వాదించారు. అయితే థర్డ్ అంపైర్ పలు కోణాల్లో రీప్లేలను పరిశీలించిన అనంతరం తిలక్ వర్మను అవుట్‌గా ప్రకటించారు. దీంతో కేవలం 11 బంతుల్లో 3 పరుగులు చేసిన తిలక్ నిరాశగా పెవిలియన్ చేరాడు. ఈ ఘటనపై స్పష్టత కోసం క్రికెట్ చట్టాలను పరిశీలిస్తే, ఎంసీసీ రూపొందించిన నిబంధనల ప్రకారం వికెట్ కీపర్ లేదా ఫీల్డర్ వికెట్లను పడగొట్టే సమయంలో బంతిపై నియంత్రణ కలిగి ఉండాలి. వికెట్లను పడగొట్టే క్షణంలో బంతి కీపర్ చేతిలో లేదా గ్లోవ్స్‌కు నియంత్రణలో ఉండాలి.వికెట్లు పూర్తిగా పడిపోయిన తర్వాత బంతి చేతిలో నుంచి జారిపోయినా ఆ స్టంపింగ్ చెల్లుబాటు అవుతుంది. వికెట్లు పడే సమయానికి బ్యాటర్ క్రీజు బయట ఉంటే అతడిని అవుట్‌గా ప్రకటించవచ్చు.మరి తిలక్ వర్మ విషయంలో ఏం జరిగింది అంటే.. రీప్లేల్లో కనిపించిన దాని ప్రకారం, జోస్ బట్లర్ వికెట్లను తాకే సమయంలో బంతి అతని గ్లోవ్స్‌కు నియంత్రణలోనే ఉంది. వికెట్లు పడిపోయిన తర్వాతే బంతి కింద పడింది. అదే సమయంలో తిలక్ వర్మ కాలు కూడా క్రీజు బయటే ఉండటంతో థర్డ్ అంపైర్ స్టంపింగ్‌ను అవుట్‌గా ప్రకటించారు.

## కొలంబియా షూటౌట్.. క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్




**వాంకోవర్**

ఫిఫా వరల్డ్‌కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4-3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్‌ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్‌లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4-3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది.ఫిఫా వరల్డ్‌కప్‌లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించలేదు. వరల్డ్‌కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ మ్యాచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు డేవిన్‌సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్‌జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.

## ఈజిప్ట్ కోచ్ వర్సెస్ మెస్సీ.. మైదానంలో తీవ్ర ఉద్రిక్తత..

**అట్లాంటా**

ఫిఫా వరల్డ్‌కప్‌లో అనూహ్య రీతిలో అర్జెంటీనా 3-2 గోల్స్ తేడాతో ఈజిప్ట్‌పై గెలిచిన విషయం తెలిసిందే. ఓ దశలో 0-2 గోల్స్ తేడాతో వెనుకబడ్డ అర్జెంటీనా.. ఆఖరి నిమిషాల్లో ప్రత్యర్థిని స్టన్ చేసింది. అయితే మ్యాచ్ ముగిసిన సమయంలో.. ఈజిప్ట్ కోచ్ హోసమ్ హసన్, అర్జెంటీనా కెప్టెన్ లియోనిల్ మెస్సీ(ాఆశీఅవశ్రీ వీవంంఱ) మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మైదానంలోని టచ్‌లైన్ వద్ద .. ఈజిప్ట్ కోచ్ దూకుడుగా ప్రవర్తించారు. మిగితా కోచింగ్ సిబ్బంది కూడా మెస్సీపై దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే ఆ కోచింగ్ స్టాఫ్ వ్యక్తికి రెడ్‌కార్డ్ జారీ చేశారు. అర్జెంటీనా స్టన్నింగ్ రీతిలో నెగ్గడంతో.. మైదానంలో నాటకీయ పరిణామం చోటుచేసుకున్నది. ఈజిప్ట్ కోచ్ హసన్ ఓ దశలో తన చేతులతో ఓ విభిన్నమైన సంకేతాన్ని చేశారు. అర్జెంటీనా ప్లేయర్ మెసీపై దూసుకెళ్లే ప్రయత్నం చేస్తూ.. తన చేతులను శ తరహాలో క్రాస్‌లో పెట్టి నిరసన వ్యక్తం చేశాడు. మెస్సీని ఉద్దేశిస్తూ ఈజిప్ట్ కోచ్ నిరసన వ్యక్తం చేయడంతో.. అక్కడే ఉన్న ఫిఫా మ్యాచ్ అఫీషియల్స్



అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియోలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి.ఫైనల్ విజిల్ తర్వాత టచ్‌లైన్ వద్ద ఉన్న హసన్ దిశగా మెస్సీ వెళ్లాడు. అయితే ఆ ఇద్దరి మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో తెలియదు. కానీ ఈజిప్ట్ కోచ్ తన చేతులను శ రూపంలో పెట్టి నిరసన వ్యక్తం చేశారు. మెస్సీపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లు ఈజిప్ట్ కోచ్‌పై ఆరోపణలు వస్తున్నాయి. అతనిపై ఫిఫా నియమావళి ప్రకారం చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆ ఘటనకు చెందిన ఆడియోను రిలీజ్ చేయలేదు. హసన్ ఇచ్చిన సంకేతం అర్థం కావడం లేదు అని ఫిఫా, ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం పేర్కొన్నది. మెస్సీ, హసన్ మధ్య గొడవ జరుగుతున్న సమయంలోనే ఈజిప్ట్ కోచింగ్ స్టాఫ్ అక్కడకు చేరుకున్నది. ఓ సభ్యుడు తన సహనాన్ని కోల్పోయి.. మెస్సీ మీదకు దూసుకెళ్లాడు. ఆ వెంటనే అర్జెంటీనా ప్లేయర్లు వచ్చి మెస్సీని చుట్టుముట్టారు. మ్యాచ్ అఫీషియల్స్, సెక్యూర్టీ సిబ్బంది కూడా చేరుకున్నారు. రెండు గోల్స్‌తో లీడింగ్‌లో ఉన్న ఈజిప్ట్ .. ఆఖరి నిమిషాల్లో షాక్ అయ్యింది. అర్జెంటీనా తేరుకుని వెంటవెంటనే గోల్స్ చేయడంతో ఈజిప్ట్ 3-2 తేడాతో ఖంగుతిన్నది. అయితే మ్యాచ్ రిఫరీలు అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఈజిప్ట్ ఆరోపించింది. భారీ అప్‌సెట్ తప్పదనుకున్న తరుణంలో.. మెస్సీ సేన అనూహ్య రీతిలో పరాభవం నుంచి గట్టెక్కింది. దీంతో ఈజిప్ట కోచ్‌తో సహా ప్లేయర్లు కూడా అర్జెంటీనాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తమకు అన్యాయం చేశారని ఈజిప్ట్ కోచ్ ఆరోపించారు. ఈ వరల్డ్‌కప్‌కు చెందిన మిగితా మ్యాచ్‌లను ఇక చూడబోనని ఈజిప్ట్ కోచ్ తెలిపారు.



# యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్..

### - టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యాష్, కియారా అద్వానీల మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ, విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి.గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా, ఈ తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యాష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 ఆగష్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




# ఆసక్తికరంగా 'హృదయం మురళి' ట్రైలర్

### 22 ఏళ్ల తర్వాత నటుడిగా థమన్..




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి'. ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు మేకర్స్.ఇక ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా మెరవబోతుండటం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



# అల్లు అర్జున్ 'రాకా'లోఛాన్స్ మిస్ చేసుకున్న బ్లాస్ట్ బ్యూటీ..

### -అసలు కారణం చెప్పిన అట్లీ!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణె కథానాయికగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యాధునిక సాంకేతికత, భారీ బడ్జెట్, స్టార్ కాస్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. తాజాగా దర్శకుడు అట్లీ చేసిన ఓ ఆసక్తికర వ్యాఖ్య ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం యువ నటి ప్రీతీ ముకుందన్ను సంప్రదించినప్పటికీ, ఆమె బిజీ షెడ్యూల్ కారణంగా ఆ అవకాశం దక్కలేదని అట్లీ స్వయంగా వెల్లడించారుప్రీతీ ముకుందన్ ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అందంతో పాటు యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆకట్టుకుని ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అంతకుముందు తెలుగు చిత్రం 'కన్నప్ప' లో కనిపించి తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. 'బ్లాస్ట్' విజయానంతరం ఆమెకు వరుసగా పలు భాషల్లో అవకాశాలు వస్తుండటంతో ప్రస్తుతం ప్రీతీ బిజీ హీరోయిన్‌గా మారిపోయారు. తాజాగా జరిగిన 'ఇదయం మురళీ' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన అట్లీ.. 'రాకా'కు సంబంధించిన ఈ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ప్రీతీ ముకుందన్‌ను 'రాకా'లో ఒక ముఖ్యమైన పాత్ర కోసం సంప్రదించామని, అయితే అప్పటికే ఆమెకు వరుస సినిమా కమిట్‌మెంట్లు ఉండటంతో డేట్లు కుదరక ఆ ప్రాజెక్ట్ చేయలేకపోయారని చెప్పారు. ప్రీతీ ముకుందన్ చేయాల్సిన పాత్రను చివరకు నటి ఫెమినా జార్జ్ అప్పగించినట్లు అట్లీ వెల్లడించారు. దీంతో 'రాకా'లో ఫెమినా ఏ తరహా పాత్రలో కనిపించబోతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా కావడంతో 'రాకా'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. భారీ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకోణె నటిస్తుండటం కూడా ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చింది. త్వరలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.

# ఆ నిజాలు నన్నెంతో భయపెట్టాయి



'ది ఇండియా స్టోరీ' కథ విని షాక్ అయ్యాను. అసలు మనం ఏం తింటున్నాం? ఇలా కల్తీ ఆహారం తింటే మన కుటుంబాల పరిస్థితేంటి? అని తలచుకుంటే రాత్రిళ్లు నిద్రపట్టేది కాదు' అంటూ ఆందోళన వ్యక్తం చేసింది నటి కాజల్ అగర్వాల్. ఆమె ప్రధానపాత్ర పోషించిన తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ'. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఆహార కల్తీ నేపథ్యంలో తెరకెక్కిన ఈచిత్రానికి చేతన్ డీకే దర్శకత్వం వహించారు.కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో కాజల్ లాయర్‌గా నటించారు. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈసినిమా విడుదల కానున్నది. ఈసందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కాజల్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'ఆహారంలో కల్తీ గురించి విన్నాను కానీ, మరీ దాని తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో ఈ సినిమాలో నటించాక అర్థమైంది. ఆ నిజాలు నన్నెంతో భయపెట్టాయి. వాస్తవానికి అద్దం పట్టే ఇలాంటి సినిమాలో నటించినందుకు గర్వంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది కాజల్ అగర్వాల్.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com